క్లుప్తంగా

విచారణ చేపట్టాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల ప్రవేశాలపై విచారణ చేపట్టాలని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి మల్లేశ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మైనారిటీ గురుకులంలో 5వ తరగతితో పాటు వివిధ తరగతుల ప్రవేశాలల్లో అవకతవకలు జరిగినట్లు అనుమానాలు ఉన్నట్లు ఆరోపించారు. వివిధ రిజర్వేషన్ కేటగిరి ప్రకారం కాకుండా ప్రిన్సిపల్ ఇష్టానుసారంగా చేపట్టినట్లు తెలిపారు.

నియామకం

వాజేడు: ఓడ బలిజ సేవా సంఘం మండల అధ్యక్షుడిగా గార నాగార్జున రావు, ఉపాధ్యక్షుడిగా సుగంధం సాంబశివరావులను నియమించారు. ఈ మేరకు ఓడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్ర దామోదర్ మంగళవారం ప్రకటించారు.

సన్మానం



కాళేశ్వరం: మహదేవపూర్ పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతయ్యను కరీంనగర్ కేడీసీసీ, నాప్కాబ్ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు మంగళవారం శాలువాతో సన్మానించారు. మహదేవపూర్ పీఏసీఎస్‌కు (ఎన్‌సీడీసీ) జాతీయ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 2023 సంవత్సరానికి గాను ఎక్సలేన్సి అవార్డు రావటంపై హర్షం వ్యక్తం చేసి కరీంనగర్‌లోని తన కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. డైరెక్టర్ దాసరి సమ్మయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఏటూరు నాగారం: మండలంలోని కమలాపురానికి చెందిన తురక లక్ష్మణ్(19) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై తాజొద్దీన్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తురక లక్ష్మణ్, బత్తుల ఉప్పలయ్య పనుల నిమిత్తం భూపాలపల్లికి వెళ్లి కమలాపురానికి వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద బైక్ అజాగ్రత్తగా నపడంతో అదుపు తప్పి కిందపడి తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందాడు. బాధితుడి తల్లి భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజలకు అవగాహన



వాజేడు: ముంపు ప్రాంతాల వారు రానున్న వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రుద్రారపు హరీశ్ అన్నారు. మండల పరిధిలోని దూలాపురం, సుందరయ్య కాలనీ గ్రామాల్లో ప్రజలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల వారి వివరాలను అందజేయాలని సూచించారు. వరద పరిస్థితి ఎక్కువగా ఉంటే ప్రతి ఒక్కరూ ఒకరికి ఒకరు సహకరించుకోవాలని చెప్పారు. వరద తీవ్రతను బట్టి పోలీసులకు, ఇతర శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గతంలో గోదావరి వరద ఎక్కడి వరకు వచ్చింది అడిగి తెలుసు కున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



వెంకటాపురం(కె): గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. రానున్న మూడు నెలలు వర్షాకాలం సీజన్‌లో సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 18 పంచాయతీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. 26 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షలకు ములుగు ఏరియ వైద్యశాలకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వామ్మో.. పలుగుల రోడ్డు

- చినుకు పడితే చిత్తడే..
- ప్రయాణం చేయడానికి జంకుతున్న జనం



బురదమయంగా ఉన్న పలుగుల-కుంట్లం రహదారి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి క్రాస్ నుంచి పలుగుల, కుంట్లం వరకు ఆరు కిలోమీటర్ల రహదారి రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో బురదతో చిత్తడిగా మారింది. మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షం పడుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు కాళేశ్వరం మీదగా మహదేవపూర్, భూపాలపల్లి, వరంగల్‌కు వెళ్లాలంటే నరకయాతనగా మారింది. బురద రహదారిలో మోకాల్లోతు గుంతలు ఉండడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇసుక లారీలు ఇబ్బడిముబ్బడిగా నడుస్తుండడంతో రోడ్డు ఆనావాళ్లు లేకుండా పోయాయి. పగటిపూటనే కనీసం నడవలేక పోతున్నామని, రాత్రి ఆపద వస్తే అంతే గతి. కనీసం పలుగుల, కుంట్లం గ్రామాలకు 108 వాహనం వచ్చే పరిస్థితులు లేవని ఆవేదన చెందుతున్నారు. విద్యార్థులు వర్షాలు పడితే పాఠశాల, కాలేజీలకు పోవడం లేదు. రైతులకు పంటల సీజన్ కావడంతో ఎరువులు, విత్తనాలు, ఫెస్టిసైడ్స్ మందులు తీసుకురావడానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుసౌకర్యం లేక ప్రతి వర్షాకాలం రెండు నెలలు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. కలెక్టర్ స్పందించి కనీసం తాత్కాలికంగా రహదారిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం నిధులు మంజూరుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

రూ.12కోట్లతో ప్రతిపాదనలు

ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో కలెక్టర్ రాహుల్‌శర్మ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు రోడ్డును పరిశీలించారు. వెంటనే రూ.12కోట్లతో ప్రతిపాదనలు వేసి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

మరమ్మతులు చేయాలి



నిధులు మంజూరు అయ్యే వరకు వర్షాకాలంలో తాత్కాలికంగా రోడ్డుకు మరమ్మతులు చేయాలి. పలుగులు, కుంట్లం గ్రామాలకు రాత్రి పూట 108 వాహనం వచ్చే పరిస్థితి లేదు. విద్యార్థులు పాఠశాల, కాలేజీలకు ఉదయం వెళ్లలేక పోతున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి.

-బర్ల కుమార్, పలుగుల

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఆర్‌ఐ

కాటారం: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. మండల కేంద్రానికి సమీపంలోని మహదేవపూర్ రోడ్డు వైపు గల సర్వే నంబర్ 41లోని ప్రభుత్వ భూమిని పలువురు ఆక్రమించారు. దీనిపై పలువురు ఫిర్యాదు చేయడంతో మంగళవారం తహసీల్దార్ ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించారు. ఆక్రమించిన వారి వివరాలు సిబ్బంది ద్వారా ఆరా తీసి ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేయించారు. త్వరలో భూమి చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని ఆక్రమణకు పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ వెంకన్న, సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్క నాటుతున్న విద్యార్థులు, హెచ్‌ఎం భాస్కర్‌రావు

మల్హర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడిచర్ల జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు మల్క భాస్కర్‌రావు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భాస్కర్‌రావు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, తిరుపతి, జయభాస్కర్, జగన్, శివలింగం, శ్రీనివాస్, మహేష్, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వారసత్వ ఉద్యోగాలు కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏల వారసులు

టేకుమట్ల: 60 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల కుమారులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ విజయలక్ష్మికి వీఆర్‌ఏల వారసులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 సంవత్సరాలపై వయస్సుల గల వీఆర్‌ఏలు 3797 మంది ఉండగా వారసత్వ ఉద్యోగాల కోసం గత ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. ధ్రువ పత్రాలను సైతం తీసుకుని పడిగాపులు కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినతిపత్రం అందించిన వారిలో గందం సురేష్, సధాకర్, రహీం, తదితరులు ఉన్నారు.

'ఎంపీడీఓపై చర్య తీసుకోవాలి'

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజాధనంతో దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు విగ్రహం ఏర్పాటుకు అనుమతిచ్చిన ఎంపీడీఓపై చర్య తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కలెక్టర్ రాహుల్‌శర్మకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస రావు, మండల నాయకులు వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీంఖాన్ మాట్లాడుతూ.. మహదేవ్‌పూర్ ప్రభుత్వ కార్యాలయంలో మహనీయుని పేరుతో కాంగ్రెస్ నాయకుడి విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. పాలకవర్గంలో మెజార్టీ సభ్యులు ఏదీ తీర్మానం చేసిన చెల్లుతుందా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాల కోసం మండల పరిషత్ కార్యాలయంలో శ్రీపాదరావు విగ్రహ ఏర్పాటుకు అనుమతిచ్చిన ఎంపీడీఓపై చర్యలు తీసుకొని, ఆ విగ్రహం స్థానంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు



నంబర్ ప్లేట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

టేకుమట్ల: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహన తనిఖీలను చేపట్టి నంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీన పర్చుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు కేసులు ఛేధించేందుకు వాహనాల నంబర్లే కీలకమని కావున వాహనదారులు తప్పని సరిగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలనే నడుపాలన్నారు. ఆయన వెంట ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, నాగరాజు, గంగరాజు ఉన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మధువంశీకృష్ణ

చిట్యాల: మండలంలోని చల్లగరిగ–రేగొండ మండలం కోడవటంచ గ్రామాల మధ్య ఉన్న లింకు రోడ్డుకు మంగళవారం బీటీ రోడ్డు పనులను ప్రారంభమయ్యాయి. గతంలో రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో ప్రజలు, వాహనాదారులు అనేక ఇబ్బందులు పడేవారు. దీంతో మండల కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకపోవడంతో ఆయన స్పందించి రూ.కోటి 70లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ మేరకు రోడ్డు పనులను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలుకల రాయకోంరు. బోజ్జం వేణు, దేవేందర్, మేకల శ్రీనివాస్, ఆకుల సుధాకర్, మూల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వరదలో చిక్కుకున్న యువకులు

- అధికారుల చొరవతో సురక్షితంగా ఇంటికి..



యువకులను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న అధికారులు

మంగపేట : వాగు వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో ఆందోళనకు గురైన యువకులు డయల్–100కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన అధికారులు వరదలో చిక్కుకున్న యువకులను సుక్షితంగా ఇంటికి చేర్చిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధిత యువకులు, అధికారులు తెలిపిన వివరాలు.. మంగపేట మండలంలోని కమలాపురం ఆర్బీహెచ్ కాలనీకి చెందిన సుక్క రీసస్, ఇందిరానగర్‌కు చెందిన దూడపాక దినేష్ గ్రామ సమీపంలోని ఎర్రవాగు దాటి రేగుల గూడెంలోని అటవీ ప్రాంతంలో ఉన్న పొలం వద్దకు సోమవారం మధ్యాహ్నం వెళ్లారు. అయితే వారు ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఎగువప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వారు వాగును దాటలేక, మరోపక్క చీకటి పడుతుండటంతో వారి వద్ద ఉన్న మొబైల్ నుంచి డయల్–100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వగా, అధికార యంత్రాగం వెంటనే అప్రమత్తమైంది. ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, మంగపేట పోలీసులు, రెవెన్యూ అధికారులు, కమలాపురం పంచాయతీ సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌పై యువకులు ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే వాగు ఉధృతి తగ్గముఖం పట్టడంతో అధికారులు యువకులను సురక్షితంగా ఇంటికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సురక్షితంగా ఇంటికి వచ్చిన వారిని చూసి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేసి అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



పలిమెల: మాట్లాడుతున్న పొలం రాజేందర్



చిట్యాల: సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

పలిమెల: ప్రజా సమస్యల పరిష్కారమే ఎర్రజెండా పార్టీల ధ్యేయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొలం రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సూదుల శంకర్ ఆధ్వర్యంలో పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఎర్రజెండా పార్టీలు ప్రతిపక్షంలో ఉండడం వల్లనే ప్రభుత్వ రంగ సంస్థలు బలోపేత మై రక్షించబడ్డాయన్నారు. తద్వారా సుస్థిరమైన ప రిపాలన జరిగిందని తెలిపారు. కార్మికులు, రైతులు , యువత, విద్యార్థులు, మహిళలు, దళితులు, ఆది వాసీలు, గిరిజనుల పక్షాన వారి సమస్యలపై సీపీఎం పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యుడు సోడి సుబ్బయ్య, బారిష దుర్గ, గుమ్మడి భీమ, పెద్ది పోచయ్య, నంద భామన్, సోడి రోజా, సుగుణ, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలకే పరిమితం

చిట్యాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు కాకుండా ప్రకటనలకే పరిమితం అయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆత్కూరి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో మొగుళ్లపల్లి, చిట్యాల, రేగొండ, టేకుమట్ల మండలాలకు చెందిన నాయకులకు మండల కేంద్రంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత విద్య, ఆరోగ్యం సక్రమంగా నిరుపేదలకు అందడం లేదన్నారు. ప్రైవేటు పేరుతో పాఠశాలలో, ఆస్పత్రులలో పేదలను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చింతల రజనీకాంత్, జిల్లా నాయకులు గుర్రం దేవేందర్, భూక్యా నవీన్, కల్పన, కుమార్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం



రేగొండ: రాష్ట్ర స్థాయి క్రికెట్‌లో రాణించి జాతీయ స్థాయికి ఎంపికైన పెద్దంపల్లి గ్రామానికి చెందిన మూగ క్రీడాకారుడు పసుల రాజును గ్రామంలోని మహిళా సంఘాల నాయకురాళ్లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల మండల అధికారి నరహరి, వివిధ సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



పెద్దాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని, గుర్రంపేట, పెద్దాపూర్ గ్రామాల్లో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో గ్రామ కమిటీ అధ్యక్షులు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామాల, యువజన నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

రేగొండ: మండలంలోని కొడవటంచ గ్రామానికి చెందిన కూనాడి ఉమాదేవి, రంగయ్యపల్లి గ్రామానికి చెందిన దేశిని మల్లయ్య, కనిపర్తి గ్రామానికి చెందిన శ్రీపతి సాంబయ్య, శ్రీపతి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశాడు. ఆయన వెంట పార్టీ అధ్యక్షుడు అంకం రాజేందర్, మాజీ సర్పంచ్ సుధాకర్, నాయకులు దగ్గు వెంకన్న, సమ్మయ్య, పోగు సుమన్, శ్రీపతి అర్జున్, బండి రమేశ్ ఉన్నారు.

గురుకులంలో వైద్యశిబిరం



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

చిట్యాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల–జూనియర్ కళాశాలలో ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 71 మంది విద్యార్థునులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో ఇద్దరి వద్ద రక్త నమునాలు సేకరించారు. అలాగే ఇద్దరికి జర్వం రావడంతో వారికి మందులు ఇచ్చి జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గొల్కొండ భిక్షపతి, డాక్టర్ రాకేశ్, వైద్య సిబ్బంది శోరిలమ్మ, రాజేందర్, సుమలత, జయలత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యార్థి దినోత్సవం

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మండల శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని నగర కార్యదర్శి పేట సాయి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల సమీపంలో దేశ నాయకులకు పూలమాలలను వేశారు. అనంతరం విద్యార్థుల హక్కుల కోసం పోరాటం అహర్నిషలు చేస్తామన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం


ములుగు: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సీతక్క సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను మంగళవారం కలెక్టర్ టీఎస్. దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీశ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. యువకులు, చిన్నారులు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

ములుగు రూరల్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా–శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మంగళవారం ములుగు–దేవగిరిపట్నం మీదుగా పత్తిపల్లికి వెళ్లే రోడ్డు పనులను మంత్రి కలెక్టర్ దివాకరతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనులకు రూ .6.56కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

విద్యతోనే పేదరికం నిర్మూలన

ఎస్ఎస్‌తాడ్వాయి: విద్యతోనే సమాజం పేదరికాన్ని నిర్మూలించవచ్చని ఆదివాసీ గూడెంలోని పిల్లల జీవితాల్లో అక్షర వెలుగు నింపేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మండలంలోని నార్లాపూర్ లో సమీపంలోని తక్కళ్లపాడు గొత్తికోయ గూడెంకు చెందిన పునేం తులసీ గత నేల 2న డ్రామా జూనియర్స్‌లో పాల్గొనగా మంత్రి సీతక్క అభినందిచారు. గూడెంలో దాతల సాయంతో మంత్రి సీతక్క నిర్మించిన పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు.

నిరుపేద విద్యార్థికి చేయూత



ములుగు రూరల్: మండలంలోని మాన్‌సింగ్‌తండా గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి నూనావత్ అనూషకు శంశాబాద్ ఎయిర్‌పోర్టు మేనేజర్ బానోత్ రవీందర్ చేయూతనందించారు. మంగళవారం అనూషకు తోటి ఉద్యోగలతో విరాళాలు సేకరంచి రూ.52 వేలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 సంవత్సరాల క్రితం తల్లితండ్రులను కోల్పోయిన అనూష బంధువుల ఇంట్లో ఉండి చదువుకుంటూ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ద్వితీయ సంవత్సరం చదువుకు డబ్బులేక మానేసి ఇంట్లో ఉంటున్న వి షయం అదే గ్రామానికి చెందిన బానోత్ రవీందర్ తెలుసుకోని తోటి ఉద్యోగు ల వద్ద విరాళాలు సేకరించి విద్యార్థినీకి అందించి ఆదర్శంగా నిలిచారు.